JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి I గురువారం 27-08-2026
Medchal - Malkajgiri I Thursday 27-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 I సంచిక : 87
పేజీలు : 8 I వెల : 5
Vol. 03 I Issue 87 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# బ్రో కాస్త ఆగు.. ఇప్పుడు మొదలుపెట్టు

- రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు కంగనా రనౌత్ కౌంటర్
- బాలీవుడ్ నటి కృతి సనన్ రక్షా బంధన్ వాణిజ్య ప్రకటన రాజకీయ దుమారం
- బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు



**జయభేరి, న్యూఢిల్లీ :**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ , బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. నటి కృతి సనన్ రక్షా బంధన్ వాణిజ్య ప్రకటనపై వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలకు కంగనా తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. పితృస్వామ్యాన్ని కూల్చివేయండనే ప్రతిపక్ష నేత వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. ఇన్‌స్టాగ్రామ్‌లో బీజేపీ పోస్టును రీషేర్ చేసిన మండీ ఎంపీ.. మహిళల హక్కులు, ప్రాతినిధ్యం విషయంలో కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, ట్రిపుల్ తలాక్, షాబానో కేసు వంటి పలు కీలక అంశాల్లో కాంగ్రెస్ వైఖరిని ఆమె ఎత్తిచూపారు. ...మిగతాది 2 లో

## కొండా సురేఖ విషయంలో సీఎం మాటే నా మాట..

2 లో






# నేపాల్‌లో ప్రకృతి విలయతాండవం

- 160 మంది మృతి.. 142 మంది భారతీయుల గల్లంతు
- నేపాల్, చైనా పరిధిలోని టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో సంభవించిన ఆకస్మిక వరదలు
- కొండచరియలు తీవ్ర వినాశనాన్ని సృష్టించాయి
- మోదీ ఫోన్.. భారత్, చైనాల అత్యవసర చర్యలు

**జయభేరి, న్యూఢిల్లీ :**

ఈ ప్రకృతి విపత్తు ధాటికి ఇప్పటివరకు కనీసం 160 మంది మరణించగా, వందలాది మంది గల్లంతయ్యారు. భారీ ప్రవాహాల కారణంగా వంతెనలు కొట్టుకుపోయాయి, ఇళ్లు ధ్వంసమయ్యాయి మరియు పలు కీలక జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. నేపాల్‌టిబెట్ సరిహద్దు సమీపంలో భోటే కోషి నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరగడంతో ఈ ఆకస్మిక వరద పోటెత్తింది. టిబెట్ ప్రాంతంలో భూకంపం సంభవించిన కొద్దిసేపటికే ఈ వరదలు మొదలయ్యాయని, భూకంపం కారణంగా గ్లేసియల్ సరస్సు బద్దలవడం (గ్లేసియల్ అవుట్‌బర్స్ట్) వల్లే ఈ ఉత్పాతం సంభవించి ఉండవచ్చని నేపాల్ అధికారులు అనుమానిస్తున్నారు. రసువా, ధాదింగ్ జిల్లాల నుంచి నువాకోట్, చిత్వాన్, నవల్‌పరాసి ఈస్ట్ తదితర ప్రాంతాలకు వరదలు వ్యాపించాయి. బాధితులను రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి.

**157 మృతదేహాలు వెలికితీత.. భారీ నష్టం**


నేపాల్ పరిధిలో ఇప్పటివరకు 157 మృతదేహాలను వెలికితీసినట్లు నేపాల్ పోలీసులు ధ్రువీకరించారు. మరో 500 మందికి పైగా ఆచూకీ లభించలేదని అక్కడి ప్రభుత్వం పేర్కొంది. టిబెట్ సరిహద్దులో కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు మరణించగా, 265 మంది గల్లంతైనట్లు చైనా అధికారిక మీడియా సీజీటీఎన్ (CGTN) వెల్లడించింది. ఈ విపత్తు కారణంగా 354 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 8 పనిచేస్తున్న జలవిద్యుత్ ప్రాజెక్టులతో పాటు నిర్మాణంలో ఉన్న మరో 5 ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అలాగే దాదాపు 19 కీలక వంతెనలు వరద నీటిలో కొట్టుకుపోయాయి.

**142 మంది భారతీయుల గల్లంతు.. రంగంలోకి ఎంబసీ**

నేపాల్‌లో గల్లంతైన వారిలో కనీసం 341 మంది విదేశీయులు ఉన్నారని, వారిలో 142 మంది భారతీయులు ఉన్నట్లు నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది. వీరంతా సామ్రాట్ టూర్స్ అండ్ ట్రావెల్స్, లీఫ్ హాలిడే, హిమాలయన్ గ్లేసియర్ ఏజెన్సీల ద్వారా పర్యటనకు వెళ్లినట్లు తెలిసింది. వీరిలో కనీసం 50 మంది కైలాస మానససరోవర యాత్రికులు ఉన్నారు. ఇమ్మిగ్రేషన్ సెంటర్‌లో ఉన్న ఈశా ఫౌండేషన్‌కు చెందిన 77 మంది సభ్యుల ఆచూకీ ఇంకా తెలియరాలేదని, 495 మంది సురక్షితంగా వెనక్కి చేరుకున్నారని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు తెలిపారు. ...మిగతాది 2 లో

# గల్లంతైన బోటు ఆచూకీ లభ్యం

- ఏడుగురు మత్స్యకారులు సేఫ్
- సీఎం చంద్రబాబు హర్షం



**జయభేరి, కోనసీమ జిల్లా :**

కోనసీమ జిల్లాలో గల్లంతైన బోటు ఆచూకీ లభ్యమైంది. ఈ నెల 3న సముద్రంలోకి వెళ్లిన ఏడుగురు మత్స్య కారులు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం అందింది. అల్లవరం మండలం ఓడలరేవు నుంచి మత్స్య కారులు వేటకు వెళ్లి గల్లంతయ్యారు. ఈ నెల 17 నుంచి సముద్రంలో గాలింపు చర్యలను ప్రభుత్వం చేపట్టింది. 10 రోజులపాటు కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ సిబ్బంది సముద్రంలో గాలించారు. అయితే ఆ ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. ఇక పడవతో పాటు ఆచూకీ కోల్పోయిన ఏడుగురిలో అంతా సురక్షితంగా ...మిగతాది 2 లో



# నగరంలో కొత్త ట్రెండ్ హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సీపీ సజ్జనార్ హెచ్చరికలు

**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రంలో రోజూ ఏదో ఒక చోట సైబర్ నేరాలు జరుగుతూనే ఉన్నాయి. బాధితులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త ట్రెండ్ లను అన్వేషిస్తున్నారు. ఇటీవలికాలంలో హైదరాబాద్ నగర పరిధిలో సాంప్రదాయ జేబుదొంగతనాలకు ఆధునిక సైబర్ నేరాలను జోడించి అమాయకుల బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్న సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాలు పెరుగుతున్న ...మిగతాది 2 లో



# వధువు మెడలో తాళి కట్టిన కవిత

- కల్వకుంట్ల కవిత వధువు మెడలో మూడు ముళ్లు ఎందుకు వేశారు?

**జయభేరి, కీసర :**

హైదరాబాద్‌లోని కీసర ఎక్స్ రోడ్డులో బుధవారం (ఆగస్టు 26) జరిగిన ఓ వివాహ వేడుక ప్రత్యేకంగా నిలిచింది. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. తమ పార్టీ నాయకుడు, యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు గ్రామానికి చెందిన బాషబోయిన బాలప్రసాద్ వివాహంలో ఇంటి ఆడబిడ్డగా వ్యవహరించారు. ఆరాధ్య కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకకు వధూవరుల కుటుంబ సభ్యులు కవితకు ఘన స్వాగతం పలికారు. బాలప్రసాద్‌కు సోదరీమణులు ఎవరూ లేకపోవడంతో, తన వివాహంలో ...మిగతాది 2 లో

# సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

- మా బిడ్డ మాటలతో మాకేంటి సంబంధం
- సుస్మిత కామెంట్స్‌పై కొండా మురళి సంచలన వ్యాఖ్యలు

**జయభేరి, హైదరాబాద్ :**

మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై కాంగ్రెస్ నాయకత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందనే ఉత్కంఠ కొనసాగుతుండగానే.. ఈ అంశంలో మరికొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నా



యి. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కొండా మురళి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమావేశం కావడం హాట్ టాపిక్‌గా మారింది. కొండా సురేఖ, చిన్నారెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతల తీరుపై టీపీసీసీకి క్రమశిక్షణ కమిటీ నివేదిక ఇచ్చిన క్రమంలో.. కొండా మురళి, రాజగోపాల్ రెడ్డి భట్టి విక్రమార్కను కలవడం చర్చనీయాంశంగా ...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## నేపాల్‌లో ప్రకృతి విలయతాండవం

బాధితుల కుటుంబాలకు సహాయం అందించేందుకు తమిళనాడు, కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ప్రత్యేక హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేశాయి. ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం అత్యవసర నంబర్లను విడుదల చేసి, నేపాల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

**మోదీ ఫోన్.. భారత్, చైనాల అత్యవసర చర్యలు**

నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడి, అన్ని విధాలా మానవతా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ ఉపశమనం కోసం భారత్ ఇప్పటికే మొదటి విడత సహాయ సామగ్రిని నేపాల్‌కు పంపింది. భారత్ అందించిన మద్దతుకు నేపాల్ ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. అటు చైనాలో కూడా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాల మేరకు గల్లంతైన వారి కోసం చైనా సైన్యం, రక్షణ బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

## వధువు మెడలో తాళి కట్టిన కవిత

ఆడపడుచుగా వ్యవహరించాలని కవితను కోరారు. ఆయన కోరిక మేరకు కవిత ముదిరాజ్ కుటుంబంలోని ఆడబిడ్డగా వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బాల్‌ప్రసాద్‌కు సీతాఫల్ మండికి చెందిన శివానితో వివాహం నిశ్చయమైంది. బుధవారం వారి వివాహ మహూర్తం జరిగింది. ముదిరాజ్ కులాచారం ప్రకారం వరుడు మంగళసూత్రధారణ చేయడానికి ముందు ఆడపడుచు చేత పసుపు కొమ్మును తాళిగా భావించి మూడు ముళ్లు వేయించే సంప్రదాయం ఉంది. ఈ ఆచారాన్ని పాటిస్తూ కవిత ముందుగా గౌరీ పూజలో పాల్గొన్నారు. అనంతరం మేళతాళాల మధ్య వధువు శివాని మెడలో పసుపు కొమ్మురాంతో మూడు ముళ్లు వేశారు. అంతేకాకుండా వధువు ఉంగరపు వేలికి ప్రధాన ఉంగరం తొడిగారు. ఒడిబియ్యం పోసి పెళ్లికుమార్తెను ఆశీర్వదించారు. వధూవరులకు నూతన వస్త్రాలను అందజేసి, సుముహూర్తంలో వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆశీర్వదించారు. అనంతరం వరుడు బాల్‌ప్రసాద్ సంప్రదాయబద్ధంగా శివాని మెడలో మంగళసూత్రం ధరింపజేశారు. ఈ వివాహ వేడుకలో బాల్‌ప్రసాద్ తల్లిదండ్రులు స్వరూప, బాలకృష్ణతో పాటు ఆయన సోదరుడు నాగరాజు, తెలంగాణ రక్షణ సేన నాయకులు, ఇరు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. బాల్‌ప్రసాద్ తెలంగాణ రక్షణ సేనలో నాయకుడిగా పనిచేస్తుండటంతో పాటు తెలంగాణ జాగృతితో నూ క్రియాశీలకంగా పనిచేశారు. తన వివాహంలో సోదరి స్థానంలో కవితను ఆహ్వానించడంతో ఈ వేడుకకు ప్రత్యేకత ఏర్పడింది. పార్టీ నాయకుడి కుటుంబ వేడుకలో కవిత సంప్రదాయ ఆచారాలను స్వయంగా నిర్వహించడం అక్కడికి వచ్చిన వారిని ఆకట్టుకుంది. ముదిరాజ్ కుటుంబ సంప్రదాయాన్ని గౌరవిస్తూ ఆడబిడ్డ బాధ్యతలను నిర్వహించిన కవిత.. వధూవరులను ఆశీర్వదించడంతో వివాహ వేడుక సందడిగా సాగింది.

## హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్

తరుణంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారే లక్ష్యంగా ఈ ముఠాలు దోపిడీకి పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని అన్నారు. రద్దీ ప్రాంతాల్లైన బస్టాండ్, రద్దీ బస్సుల్లో ప్రయాణికులు ఫోన్ అన్ లాక్ చేసే సమయంలో పిన్/ప్యాటర్న్ నిశితంగా గమనించి ఫోన్లను చోరీ చేస్తున్నారని సజ్జనార్ పేర్కొన్నారు. 'సంప్రదాయ జేబు దొంగతనాలకు ఆధునిక సైబర్ నేరాలను జోడించి ఆయా ముఠాలు బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్న సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారే లక్ష్యంగా ఈ ముఠాలు వ్యవస్థీకృతంగా దోపిడీకి పాల్పడుతున్నట్లు మా దర్యాప్తులో వెల్లడైంది. బస్టాండ్లు, రద్దీ బస్సుల్లో ప్రయాణికులు ఫోన్ అన్ లాక్ చేసే సమయంలో పిన్/ప్యాటర్న్ నిశితంగా గమనించి ఫోన్లను చోరీ చేస్తున్నారు' అని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఒకవేళ లాక్ తెలియకపోతే.. బాధితులు కాల్ చేసినప్పుడు 'మేము బస్సు కండక్టర్ల.. ఫోన్ ఇచ్చేస్తాం' అంటూ లేదా 'ఓనర్ వెరిఫికేషన్' పేరిట మాయమాటలు చెప్పి స్క్రీన్ పాస్‌వర్డ్‌లు రాబడుతున్నారు. అనంతరం ఫోన్ గ్యాలరీ, నోట్స్ యాప్‌లలో దాచుకున్న డెబిట్ కార్డులు, ఆధార్/పాన్ వివరాలను సేకరిస్తున్నారు. ఆ తర్వాత దొంగిలించిన సిమ్ కార్డు ద్వారా వచ్చే ఓటీపీలతో యూపీఐ, నెట్ బ్యాంకింగ్ పాస్ వర్డ్ లు రీసెట్ చేసి, నిధులను ఆన్ లైన్ గేమింగ్ యాప్స్, మ్యూల్ అకౌంట్లకు మళ్లించి డ్రా చేస్తున్నారు.. అని వివరించారు. ఈ తరహా నేరాలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తరహా నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఫోన్ పోయినప్పుడు ఎవరైనా ఫోన్ చేసి ఇచ్చేస్తామని చెప్పినా.. ఎట్టిపరిస్థితుల్లోనూ స్క్రీన్ లాక్ పిన్, ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దని సూచించారు. ఏటీఎం కార్డులు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్/పాన్ కార్డుల ఫోటోలను ఫోన్ గ్యాలరీలో, నోట్స్ లో ఎప్పుడూ భద్రపరచుకోవద్దన్నారు. ఫోన్ పోయిన వెంటనే సిమ్ కార్డును, బ్యాంక్/యూపీఐ సేవలను తక్షణమే బ్లాక్ చేయించి, http://ceir.gov.in పోర్టల్ లో ఫోన్‌ను బ్లాక్ చేయాలని సూచించారు. సైబర్ మోసం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా http://cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

మారింది. ఈ సమావేశంలో పలు విషయాలను మాట్లాడినట్లు తెలుస్తోంది. అధిష్ఠానం నిర్ణయం ఎలా ఉండబోతోంది.. అలాగే.. ఎలాంటి పరిణామాలుంటాయి..? అనే విషయాలను భట్టితో కొండా మురళి.. మాట్లాడినట్లు సమాచారం. అయితే.. భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం కొండా మురళి కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలపై భట్టితో చర్చించలేదని స్పష్టం చేశారు. సుస్మిత ఆమెకు నచ్చినట్టుగానే ఉంటుందన్నారు. తన కూతురికి స్వతంత్రంగా మాట్లాడే హక్కు ఉందన్నారు. ఓ బిల్లుపై చర్చించేందుకు భట్టి దగ్గరికి వచ్చానని.. భట్టితో క్రమశిక్షణ కమిటీ రిపోర్టుపై చర్చించలేదని కొండా మురళి కామెంట్ చేశారు. సురేఖ అందుబాటులో లేదనడం అవాస్తవమని, వరంగల్‌లో పర్యటిస్తున్నారని పేర్కొన్నారు. సుస్మితకు 38ఏళ్లు, ఆమెకు 15ఏళ్ల వరల్డ్ చాంపియన్ కొడుకున్నాడని.. సుస్మిత తనకు తగ్గట్టుగా తాను ఉంటుందన్నారు. గాంధీ కుటుంబంపై పూర్తి విశ్వాసముందని, కాంగ్రెస్ లోనే కొనసాగుతానని కొండామురళి తెలిపారు.

"సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం.. ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి.. సుస్మితను ప్రశ్నించే హక్కు మాకు లేదు.. కమిటీకి మేం చెప్పాల్సింది చెప్పాం.. నేను కాంగ్రెస్‌లోనే కొనసాగుతా.. ఓ బిల్లు విషయంలో భట్టిని కలిశా.. గాంధీ కుటుంబంపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉంది.. బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు రాలేదా.. ఎవరూ మాట్లాడట్లేదు... దీనిపై గోల ఎందుకు?.. నా బిడ్డకు స్వతంత్రంగా మాట్లాడే హక్కుంది".. అంటూ కొండా మురళి పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం షురూ!

✍ జయభేరి, మంచిర్యాల :

జిల్లాలో ఆగస్టు 31 నుంచి 40,000 మంది ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహార అల్పాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సింగరేణి సీఎస్ఆర్ నిధులు, హరేకృష్ణ ఫౌండేషన్ సహకారంతో పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆటోమేటెడ్ సెంట్రలైజ్డ్ కిచెన్ సిద్ధం చేశారు. ఈ కిచెన్ గంటకు 8,000 ఇడ్లీలు, 3,000 దోశలు, 5,000 పూరీలు తయారు చేయగలదు. వ్యర్థ నీటి శుద్ధి ప్లాంట్, బయోగ్యాస్ తయారీ వ్యవస్థ వంటి ఆధునిక సదుపాయాలు కూడా ఉన్నాయి.

# మోదీ మాస్టర్ స్ట్రోక్!




భారత రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలకమైన 'జమిలి ఎన్నికల' విధానంపై మరోమారు చర్చ మొదలైంది. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమ సర్కారు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు, యూటీల శాసన సభ ఎన్నికలను కలిపి నిర్వహించడానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నది. భారత ఎన్నికల వ్యవస్థలో పెద్ద మార్పు తీసుకురావాలనే ప్రయత్నం కొన్ని నెలలుగా కొనసాగుతోంది. లోక్‌సభ, విధానసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చర్చలు తీవ్రమవుతున్నాయి. కమిటీ చైర్మన్ పీపీ చౌదరి ఇటీవలి అప్‌డేట్‌లో స్టేక్‌హోల్డర్లలో అధిక శాతం మద్దతు ఉందని, 2034కు బదులు 2029లోనే అమలు చేయవచ్చని సూచించారు. ఇదే ఇప్పుడు చర్చనీయాంశం అయింది.జేపీసీ చైర్మన్ పీపీ చౌదరి ప్రకారం, ఇప్పటివరకు సంప్రదించిన సివిల్ సొసైటీ, నిపుణులు, వివిధ సంస్థల్లో సుమారు 99 శాతం మంది జమిలి ఎన్నికలకు అనుకూలంగా మాట్లాడారు. కమిటీ పలు రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తోంది. రాజ్యాంగ సవరణ 2028లోగా పూర్తయితే, 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు కొన్ని విధానసభలను కలిపి నిర్వహించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి కీలకం. కొన్ని రాష్ట్రాలు తమ అసెంబ్లీలను ముందస్తుగా రద్దు చేసి చక్రం సరిపోల్చుకుంటే మరింత సులభమవుతుంది. దేశంలోని 17 రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా అధికారంలో ఉన్నది. మరో ఐదు రాష్ట్రాల్లో బీజేపీ మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నాయి. అలా మొత్తంగా 22 రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలు జరగడానికి ముందే ఎన్డీయే పాలిత 11 రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే మరో నాలుగు ఎన్డీయే రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మిగతా ఏడు ఎన్డీయేపాలిత రాష్ట్రాల ఎన్నికలు 203031 మధ్య జరుగనున్నాయి. దీంతో జమిలి ఎన్నికల కోసం తమ రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పాలనను వెనక్కి కానీ ముందుకు కానీ జరుపుకునేందుకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని ఎన్డీయే సర్కారు భావిస్తున్నది.2029లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో 'జమిలి' ప్రక్రియకు పెద్దగా ఇబ్బందులు ఎదురు కావడం లేదు. అయితే 2028లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, త్రిపుర, తెలంగాణ, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం అసెంబ్లీల గడువు ముగుస్తున్నది. జమిలి ఎన్నికల కోసం ఆయా అసెంబ్లీల కాలాన్ని 5 నెలల నుంచి ఏడాది వరకు పొడిగించాల్సి ఉంటుంది.ఇక బీహార్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీల గడువు 203031లో ముగియనున్నది. వాటి గడువును ఒకటి నుంచి రెండేండ్లు తగ్గించాల్సి వస్తుంది. అయితే, ఇంతటి భారీ సంస్కరణకు పార్లమెంట్ శాసనపరమైన మార్పులు చేయడంతో పాటు విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ప్రతిపాదనను జార్ఖండ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విపక్ష ప్రభుత్వాలు పెద్దయెత్తున వ్యతిరేకించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలోనే తొలుత తాము అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో జమిలి ప్రక్రియను కొనసాగించడానికి ఎన్డీయే ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయిగతంలో 2034ని లక్ష్యంగా చెప్పినా, ఇప్పుడు ముందుకు తీసుకురావాలనే ఆలోచన బలపడుతోంది. ఇది రెండు దశల్లో అమలు కావచ్చు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం, ప్రియాంకా గాంధీ వాద్రా, సాగరికా ఘోష్, సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. చిదంబరం బలంగా వ్యతిరేకించారు. ప్రస్తుత రూపంలోని ప్రతిపాదన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని దెబ్బతీస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని వాదించారు. ఎన్నికైన అసెంబ్లీల పదవీకాలాన్ని తగ్గించడం సమస్యాత్మకమని అభిప్రాయపడ్డారు. మరోవైపు పద్మ అవార్డు గ్రహీతలు, కొన్ని పాలసీ గ్రూపులు జాతీయ ప్రయోజనంగా చూశారు. అయితే తగిన రక్షణలు, స్పష్టమైన నిబంధనలు అవసరమని సూచించారు. ఎన్నికల కమిషన్‌కు అధిక అధికారాలు రాకుండా జాగ్రత్తలు కావాలని కూడా అభిప్రాయాలు వచ్చాయి.మద్దతుదారులు పదేపదే ఎన్నికల వల్ల జరిగే ఆర్థిక నష్టం, అభివృద్ధి పనుల్లో అంతరాయం, మోడల్ కోడ్ వల్ల పాలనా స్తబ్ధతను ఎత్తి చూపుతున్నారు. జమిలి ఎన్నికలు ఖర్చు తగ్గించి, పాలనకు స్థిరత్వం ఇస్తాయని వాదిస్తున్నారు. ఇక వ్యతిరేకులు ఫెడరల్ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం, ప్రాంతీయ సమస్యలు జాతీయ అంశాల్లో కలిసిపోయే అవకాశం, చిన్న పార్టీలపై ప్రభావం లాంటి వాటిని లెక్కపెడుతున్నారు.జేపీసీ నివేదిక శీతాకాల సమావేశం వరకు వాయిదా పడింది. రాజకీయ సమ్మతి ఏర్పడితే 2029లో పాక్షికంగా అయినా అమలు సాధ్యమే. లేకపోతే 2034 వైపు వెళ్తుంది. ఈ ప్రతిపాదన భారత ప్రజాస్వామ్య పనితీరును పునర్నిర్మించే ప్రయత్నం. సమ్మతి, రాజ్యాంగ రక్షణలు, రాష్ట్రాల సహకారం లేకుండా ముందుకు సాగడం కష్టం. భవిష్యత్ దిశను నిర్ణయించేది పార్లమెంట్ చర్చలు, రాజకీయ సంకల్పమే.కుల గణన విధానంపై విశ్లేషకులు, కార్యకర్తలు, రాజకీయ నేతలతో 'స్క్రోల్' సంస్థ మాట్లాడినప్పుడు పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారిలో అధిక శాతం మంది కులాలను లెక్కించేందుకు ఎన్నుకున్న పద్ధతి లోపభూయిష్టమని అన్నారు. ఇటీవల బీహార్, తెలంగాణ తదితర రాష్ట్రాలు కులగణన నిర్వహించినప్పుడు 2011 మోడల్‌కు కట్టుబడి ఉండాలనే మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని వారు ప్రశ్నించారు. జనాభా లెక్కల్లో సేకరించే కుల డేటా నిరుపయోగంగా మారుతుందని కొందరు విమర్శకులు వాదించారు. 2021 సెప్టెంబర్ 21న మోదీ ప్రభుత్వం కుల గణన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అఫిడవిట్‌లోని 12(డి) పేరాలో '2011 జనాభా లెక్కల నిర్వహణకు ముందు కులాల రిజిస్ట్రీ ఏదీ సిద్ధం చేయలేదు' అని ఉంది. కాగా కులగణన కోసం ఎన్యూమరేటర్లు మొదట ప్రజలను షెడ్యూల్ కులాలు (ఎస్సీ) లేదా షెడ్యూల్ తెగలకు (ఎస్టీ) చెందినవారా కాదా అని అడుగుతారు. ఈ సమయంలో ప్రజలు తమ కులాన్ని ప్రకటించడానికి ఇష్టపడటం లేదని చెప్పే అవకాశం కూడా ఉందని 'ది హిందూ' పేర్కొంది. కాగా కులంపై పరిమితులు లేని ప్రశ్నలు ఉండటం వలన వైవిధ్యంతో కూడిన సమాధానాలు వస్తాయని ఇది అర్థవంతమైన విశ్లేషణను అందించదని విమర్శకులు వాదిస్తున్నారు. 2001 నుంచి జనాభా లెక్కల్లో కులం లెక్కింపుపై వాదన చేస్తున్న సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్ పాండే దీనిని ప్రణాళికాబద్ధమైన వైఫల్యం అని పేర్కొన్నారు. కులం గురించి పలు ప్రశ్నలు అడగడం వల్ల ఒకే సమాజానికి చెందిన వారు వేర్వేరు కులాల పేర్లతో తమను తాము గుర్తించుకునే అవకాశం ఉంది.

# కొండా సురేఖ విషయంలో సీఎం మాటే నా మాట..

■ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కామెంట్స్

✍ జయభేరి, హైదరాబాద్ :



తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న కొండా సురేఖ వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి వ్యవహారంలో.. ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ తన రిపోర్టును టీపీసీసీకి అందించిందని.. ఇందులో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఇదే విషయాన్ని చెప్పారని.. ఈ వ్యవహారంలో సీఎం మాటే తన మాట అని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఇక కొండా సురేఖ వ్యవహారంలో రాయబారం చేసేందుకే తాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశానని జరుగుతున్న ప్రచారాన్నిఖండించారు. కొండా సుస్మిత వ్యాఖ్యలు, చిన్నారెడ్డి వ్యవహారంపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి.. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కమిటీఉందని గుర్తుచేశారు. సంబంధిత అంశాలను పరిశీలించిన కమిటీ పీసీసీకి నివేదిక సమర్పించిందని చెప్పారు. ఇక దీనిపై అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని ఎవరూ కాదనలేరని అన్నారు. ఇటీవల కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పార్టీ క్రమశిక్షణ కమిటీ నివేదిక సమర్పించిన నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో అధిష్ఠానం నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటాననే సంకేతాన్ని ఆయన ఇచ్చారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో తన భేటీపై కూడా రాజగోపాల్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కని కలవడం పూర్తిగా తన నియోజకవర్గ అభివృద్ధి, నిధులకు సంబంధించిన అంశాల కోసమేనని చెప్పారు. కొండా సురేఖ వ్యవహారంపై చర్చించేందుకే తాను భట్టిని కలిశారన్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతను అని.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు.

2018 ఎన్నికల్లో పలువురు కీలక కాంగ్రెస్ నేతలు ఓడిపోయినప్పటికీ మునుగోడు ప్రజలు తనను గెలిపించారని కోమటిరెడ్డి గుర్తుచేశారు. తెలంగాణలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని ప్రయత్నించిన కేసీఆర్‌కు వ్యతిరేకంగా తాను పోరాడిన విషయాన్ని ప్రస్తావించారు. ఇతర పార్టీల నుంచి ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల.. ముందు నుంచి పార్టీ కోసం పనిచేసిన అసలైన కార్యకర్తలకు నష్టం జరగకూడదని తాను చెబుతున్నానని రాజగోపాల్ రెడ్డి అన్నారు. నిజాయితీగా ఉద్యమంలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలను పార్టీ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. తాను పార్టీకి వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలేదని తేల్చి చెప్పిన రాజగోపాల్ రెడ్డి.. వ్యక్తిగతంగా సీఎం రేవంత్ రెడ్డిని లేదా ఇతర కాంగ్రెస్ నేతలను విమర్శించలేదని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసమే తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నానని తెలిపారు.

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తన లక్ష్యమని.. కాంగ్రెస్‌ను బలహీనపరిచేలా తాను ఎప్పుడూ వ్యవహరించబోనని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తనపై దుష్ప్రచారం చేస్తున్న కొన్ని మీడియా సంస్థలపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీడియా, జర్నలిస్టులంటే తనకు గౌరవం ఉందని చెబుతూనే.. కొందరు వ్యక్తులకు అనుకూలంగా పనిచేస్తూ తమ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వార్తలు ప్రచారం చేయడం సరికాదన్నారు.

తనను, తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన నిజమైన నాయకులను కించపరిచేలా కథనాలు రాస్తే సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. తమకు కూడా మీడియా సంస్థలను ఏర్పాటు చేసే సామర్థ్యం ఉందని వ్యాఖ్యానించారు. అయితే అన్ని మీడియా సంస్థలను తాను తప్పుబట్టడం లేదని, కొందరినే ఉద్దేశించి మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు.

## బ్రో కాస్త ఆగు..

"కాస్త ఆగు బ్రో.... భారత్ మాతాకీ జై.. ఇక మీరు చెప్పాల్సింది కానీయ్యండి' అంటూ ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మహిళల గురించి మాట్లాడిన రాహుల్..ముందు దేశమాతను గౌరవించాలంటూ కంగనా పరోక్షంగా చెప్పారు. బాలీవుడ్ నటి రక్షా బంధన్ యాడ్ చుట్టూ మొదలైన ఈ వివాదం.. ఇప్పుడు రాజకీయాల వైపు మళ్లింది. కాంగ్రెస్, బీజేపీ సహా వివిధ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. కృతి సనన్ వస్త్రధారణ 'ఉద్దేశపూర్వకంగానే భయపెట్టేలా' ఉందని కంగనా వ్యాఖ్యానించగా.. మరికొందరు 'అసభ్యకరంగా' ఉందని అన్నారు. దీనిపై సనన్ స్పందిస్తూ.. "మహిళలు ఎలాంటి బట్టలు వేసుకోవాలని చెప్పడం ఎప్పుడు ఆపుతాం?" ప్రశ్నించారు. దీనిపై రాహుల్ సోషల్ మీడియాలో ట్యాగ్ చేస్తూ "ఒక మహిళ ఏమి ధరిస్తుంది, ఏమి చేస్తుంది.. ఎక్కడికి వెళుతుంది అనేది ఆమె ఇష్టం.. తమ స్వేచ్ఛను వినియోగించుకుంటున్న మహిళలను ట్రోల్ చేయడం ఆపండి" అని "smash the patriarchy" అనే హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగిస్తూ అన్నారు. విమర్శలతో యాడ్‌ను జీవా ఉపసంహరించుకుంది. మతపరమైన లేదా సాంస్కృతిక మనోభావాలను దెబ్బతీయడం తమ ఉద్దేశం కాదని పేర్కొంది. బీజేపీ ఎంపీ బన్సూరి స్వరాజ్ కూడా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళలపై అవమానకరమైన వ్యాఖ్యలను ఖండించడంలో కాంగ్రెస్ నాయకుడు విఫలమైన అనేక సందర్భాలు ఉన్నాయని ఆమె ఉదహరించారు. "కంగనా రనౌత్‌ను దూషించినప్పుడు.. అలాగే, ఒకసారి హేమా మాలినిపై అవమానకరమైన వ్యాఖ్య చేసినప్పుడు కూడా రాహుల్ గాంధీ మాట్లాడలేదు... రాష్ట్రపతి ముర్మును అధిర్ రంజన్ చౌదురి అగౌరవించారు.. పలువురు కాంగ్రెస్ నాయకులు మహిళలకు వ్యతిరేకంగా మాట్లాడారు.. అయినా రాహుల్ గాంధీ మౌనంగా ఉండిపోయారు.. ఇప్పుడు ఆయన పితృస్వామ్యాన్ని కూలదోయడం గురించి మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీని నేను అడగాలనుకుంటున్నాను.. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో ఒక్క మహిళా నాయకురాలు కూడా ఎందుకు లేదు? ఆయన మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు వ్యతిరేకించారు? మరి మీరెందుకు మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్నారు?" అని బన్సూరీ స్వరాజ్ ప్రశ్నించారు.

## గల్లంతైన బోటు ఆచూకీ లభ్యం

ఉండడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరం శ్రమించిన గాలింపు బృందాలకు, అధికార యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఏం జరిగిందంటే..? ఈ నెల 3వ తేదీన ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్య కారులతో కూడిన బోటు సముద్రంలోకి వెళ్లింది. అయితే సాకేంతిక లోపంతో పనిచేయక, గాలులకు వేరే ప్రాంతానికి కొట్టుకుపోయింది. నిర్ణీత గడువు దాటినా తిరిగి రాలేదనే విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు..

దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. స్వయంగా మంత్రులను పంపి గాలింపును పర్యవేక్షించారు. గల్లంతైన మత్స్య కారుల ఆచూకీ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్ని మార్గాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. ఘటనపై సీఎం మూడు సార్లు సమీక్షించి రెస్క్యూ ఆపరేషన్ కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. ఏ మాత్రం నిరాశ చెందకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నేవీ, కోస్ట్ గార్డ్, సెంట్రల్ మెరైన్ విభాగాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం సంప్రదింపులు జరిపింది. కోనసీమ తీరం నుంచి పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండొచ్చనే అంచనాతో పశ్చిమ బెంగాల్ కోస్ట్ గార్డ్ విభాగాలను, అక్కడ స్థానికంగా ఉన్న శంకర్ పూర్ ఫిషింగ్ హార్బర్ మత్స్య కారులను అప్రమత్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల సహకారాన్ని కూడా తీసుకున్నారు. అన్ని ప్రయత్నాలు ఫలించి శంకర్ పూర్ సమీపంలో బోటును, అందులోని ఏడుగురు మత్స్య కారులను రక్షించగలిగారు. అలాగే మత్స్య కారుల ఆచూకీ లభ్యమైన వెంటనే ఆ వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్య కారులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# ముంపు బాధితుల ఆందోళనలకు సిద్ధం కావాలి

- ఆర్అండ్ఆర్ కాలనీలో కన్నీళ్ల సాగరం' పుస్తకం ఆవిష్కరణ

**జయభేరి, గజ్వేల్, ఆగస్టు 26:**

మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల ముంపు బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం భావవ్యక్తీకరణ ఆందోళనలకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. ముంపు బాధితుల కన్నీటి గాథలను ప్రతిబింబించేలా ఉపాధ్యాయుడు పులిరాజు, సీనియర్ జర్నలిస్టు రాజేందర్ రచించిన 'కన్నీళ్ల సాగరం' పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. గజ్వేల్‌లో జరిగిన కార్యక్రమంలో గాయకుడు ఏపూరి సోమన్న, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సజయ, డీపీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ తదితరులతో కలిసి కోదండరాం పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ నిర్మాణ సమయంలో నిర్వాసితుల తరపున అనేక ఉద్యమాలు చేపట్టామని గుర్తు చేశారు. అప్పటి ప్రభుత్వం 14 గ్రామాల ప్రజలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆందోళన చేసిన తనను రెండుసార్లు అరెస్టు చేసి జైలుకు పంపించారని పేర్కొన్నారు. ఇప్పటికీ ప్రభుత్వ నష్టపరిహారం అందని కుటుంబాలను గుర్తించి సమగ్ర నివేదిక రూపొందించాలని కోరారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు.





**2013 చట్టం ప్రకారం న్యాయం చేయాలి**

కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ నిర్వాసిత కుటుంబాలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ జర్నలిస్టు సజయ డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణం జరిగే ప్రాంతాల్లో ముంపు బాధితులకు చట్ట ప్రకారం నష్టపరిహారం అందించాల్సి ఉన్నప్పటికీ, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుని, న్యాయం దక్కే వరకు నిరాశ చెందకుండా పోరాడాలని పిలుపునిచ్చారు.

**ముంపు గ్రామాలన్నీ ఏకతాటిపైకి రావాలి**

ముంపు గ్రామాల బాధితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారి తరపున పోరాడతానని గాయకుడు ఏపూరి సోమన్న తెలిపారు. తన పాట ఎప్పుడూ ప్రజల పక్షమేనన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని సంవత్సరాలైనా ముంపు బాధితులను పరామర్శించేందుకు ఒక్క మంత్రి కూడా రాకపోవడం బాధాకరమన్నారు. గతంలో బాధితుల కోసం పోరాడుతూ లాఠీ దెబ్బలు తిని, కేసులు ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. ముంపు గ్రామాల బాధితులంతా ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల కోసం పోరాడాలని కోరారు.ఏపూరి సోమన్న ముంపు బాధితుల గోడును తన పాట ద్వారా వినిపించగా పలువురు మహిళలు భావోద్వేగానికి గురయ్యారు.ఈ కార్యక్రమంలో పుస్తక రచయితలు పులిరాజు, రాజేందర్, కౌన్సిలర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, వెల్దండి నరసింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, దాసరి కృష్ణ, రాజులు, గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశం, సత్యనారాయణ, నరేందర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- జీవో 97ను వెంటనే ఉపసంహరించి పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి
- పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిపై పెట్టిన కేసును బేషరతుగా కొట్టివేయాలి
- నాగులపల్లి ఉప సర్పంచ్ సుమన్ గౌడ్

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 26 :**

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం.97ను వెంటనే ఉపసంహరించుకోవాలని నాగులపల్లి ఉపసర్పంచ్ సుమన్ గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలపై ప్రశ్నించడం, వారి భవిష్యత్తు కోసం అండగా నిలబడటం నేరమా అని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలపై స్పందించిన బీజేపీ షాద్‌నగర్ నియోజకవర్గ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిపై కేసులు నమోదు చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు.ప్రజా సమస్యలపై గొంతెత్తే నాయకులు, కార్యకర్తలను పోలీసు కేసులతో భయపెట్టాలని ప్రభుత్వం చూస్తే బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా ప్రభుత్వం వెంటనే జీవో 97ను ఉపసంహరించి, పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిపై నమోదు చేసిన కేసును బేషరతుగా కొట్టివేయాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సుమన్ గౌడ్ డిమాండ్ చేశారు.విద్యార్థుల హక్కుల కోసం, వారి భవిష్యత్తు కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని ఆయన తెలిపారు.

## రక్తదాన శిబిరం

- హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు
- మహబూబ్ నగర్ టీం సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శిబిరం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ వేడుకలు మరియు మహబూబ్ నగర్ టీమ్ సోషల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఒబెదుల్లా కొత్వాల్, మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తదితర జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొని ముస్లిం సోదర, సోదరీమణులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు.

## వ్యాపారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- మార్కెట్ రంగంలో గొప్ప బ్రాండ్ గా పేరు పొందాలి...
- నూతన ఐస్క్రీమ్ అండ్ డిస్ట్రిబ్యూట్ సెంటర్ ప్రారంభించిన రాసుమల్లగూడ గ్రామ సర్పంచ్ "నత్తి శివరాములు"

**జయభేరి, షాద్ నగర్ :**



వ్యాపార రంగంలో నాణ్యత ప్రమాణాలు పాటించి వినియోగదారుల నమ్మకంతో వ్యాపారంలో రాణించాలని రాసుమల్ల గూడ సర్పంచ్ నత్తి శివ రాములు అన్నారు. బుధవారం గోరిగే శ్రీశైలం యొక్క అర్జున్ అరుణ్ ఐస్క్రీమ్ డిస్ట్రిబ్యూట్ షాప్ ను సర్పంచ్ శివ రాములు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివ రాములు మాట్లాడుతూ; వ్యాపార రంగంలో వినియోగదారులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన వస్తువులను అందించాలని అన్నారు. పరిగెత్తుతున్న ప్రపంచంలో ఎప్పటికప్పుడు వ్యాపారంలో నూతన విధివిధానాలను అనుసరిస్తూ బ్రాండెడ్ వస్తువులను వినియోగదారులకు అందించేందుకు కృషి చేస్తూ వ్యాపారంలో లాభాలు పొందాలని, నాన్నతో ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వినియోగదారులకు నమ్మకంగా ఉండాలని అన్నారు. పోటీ ప్రపంచంలో వ్యాపారంలో రాణించాలంటే వినియోగదారుల ఆలోచన విధానాలకు అనుగుణంగా బ్రాండెడ్ వస్తు సేవలను వారికి అందించేందుకు నిరంతరం కృషి చేయాలి. వినియోగదారుల నమ్మకమే వ్యాపారానికి ఒక మైలురాయిలా ఉంటుందని, అందుకు యజమానులు ఎప్పటికప్పుడు కొత్త ఆలోచన విధానాలతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ బ్రాండ్ క్రియేటర్ గా నిలవాలని సర్పంచ్ శివరాములు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకట్రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నందిమల రాములు గౌడ్, ఉప సర్పంచ్ మెరుగు మహేందర్ రెడ్డి, భార్గవ రెడ్డి, శ్రీనివాస్, చిరంజీవి , వెంకటేష్, నవీన్, మెరుగు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛ, మానవత్వం.. మహమ్మద్ ప్రవక్త మార్గం

- సర్వమత సమానత్వమే ప్రపంచాన్ని నడిపిస్తుంది
- మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జయభేరి, షాద్ నగర్ :**



స్వేచ్ఛ, సమానత్వం మహమ్మద్ ప్రవక్త చూపించిన మార్గాలని, ఆ మార్గంలో ప్రతి ఒక్కరు ముందుకు నడవాల్సిన అవసరం ఉందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలో ఇలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ మతమైనా మంచితనాన్ని, మానవత్వాన్ని, ఐక్యతనే బోధిస్తుందని, అలాంటి బోధనల ద్వారా సమాజాన్ని శాంతి పదం వైపు నడిపించిన మహోన్నత వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అని కొనియాడారు. ప్రస్తుత తరుణంలో కొందరు స్వార్ధపరులు మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి తరుణంలో మహనీయుల బోధనల ద్వారా పరస్పర ప్రేమతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సర్వమత సమానత్వమే నాటి నుంచి నేటిదాకా మన దేశాన్ని ముందుకు నడిపిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులకు ఈ సందర్భంగా ఆయన పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**భారీగా ఊరేగింపు..**

ఇలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణంలో ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పవిత్ర ప్రార్థనల ద్వారా పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భారీ ఎత్తున జరిగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో పాటు మున్సిపాలిటీ చైర్మన్ అగునూరు బసవేశ్వర్, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

- పార్టీ కండువా కప్పి స్వాగతం పలికిన ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు, ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం చిన్నచింతకుంట మండలం గూడూరు గ్రామానికి చెందిన గూడూరు మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గొల్ల బాల చంద్రయ్య గారు, బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ సంధ్య మాసన్న గారి దంపతులు, బిఆర్ఎస్ పార్టీ గూడూరు గ్రామ మాజీ అధ్యక్షులు హెచ్. కుర్మన్న, బిఆర్ఎస్ నాయకులు గొల్ల శివ, జి. మాసన్న, బీజేపీ నాయకులు డి. తరుణ్ , డి. బాలకృష్ణ , ఎరుకలి మాసన్న, పలువురు బిఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ సచ్చిదానందం కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ చల్లా వంశీ చంద్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్), జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ సంజీవ్ ముదిరాజ్ తదితర కాంగ్రెస్ నాయకులు వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే జియంఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. అనంతరం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి జన్మదినం సందర్భంగా మిథున్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



## విలేకరి కుటుంబానికి చల్లా పరామర్శ

**జయభేరి, పరకాల, ఆగస్టు 26:**

పరకాల పట్టణానికి చెందిన జర్నలిస్ట్ ఓదెల శివ తండ్రి బిక్షపతి మృతిచెందిన విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బిక్షపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తీజ్ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణం లో తీజ్ ఉత్సవ ఊరేగింపులో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్. గిరిజన సంప్రదాయ పండుగ తీజ్ ఉత్సవాలలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ పాల్గొని ప్రకృతి దేవతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేతావత్ బీల్యా నాయక్ మాట్లాడుతూ గిరిజన యువతులు, యువకులు ప్రకృతినే దైవంగా భావించి పుట్ట మట్టి తీసుకొచ్చి అందులో విత్తనాలు వేసి మొలకలు వచ్చే వరకు 9రోజులపాటు నిష్టతో పూజలు చేసి భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేస్తే కోరుకున్న కోరికలు తీరుతాయని నమ్ముతారని ఆ నమ్మకాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారని అన్నారు. ఇంతటి పవిత్ర పూజా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషం కలిగించిందని అన్నారు. తీజ్ పండుగ సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నేనావత్ కిషన్ నాయక్ తో పాటు గిరిజన సంఘాల నాయకులు గిరిజన యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులు ఒకే చోట

- మన గ్రోమోర్ సెంటర్ ప్రారంభించిన BRS రాష్ట నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి



**జయభేరి, చింతపల్లి :**

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ అవసరమైన వస్తువులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చింతపల్లి మండలం కుర్మేడు గేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మన గ్రోమోర్ సెంటర్‌ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులో ఉండేలా గ్రోమోర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను సరసమైన ధరలకు అందిస్తూ, వ్యవసాయంలో మెరుగైన దిగుబడులు సాధించేందుకు సహకరించాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ,వారికి అవసరమైన సేవలను మరింత చేరువ చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుర్మేడు గ్రామ సర్పంచ్ కంబాలపల్లి చెన్నమ్మ లాలయ్య,ఉప సర్పంచ్ అనంతుల పవన్,ఆర్.ఎన్ ప్రసాద్,గుండెబోయిన శ్రీశైలం,ఈరటి మల్లేష్,నాదిరి శ్రీశైలం,నాదిరి రమేష్,నాదిరి జంగయ్య,గౌని శేఖర్, బైరగొండ బిక్షం, అంజిబాబు,అనంతుల వెంకటయ్య,గునుగంటి శివ,కిషన్ నాయక్,కుర్మేటి భీమయ్య,వర్కాల నారయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక మృతి.. గౌరారం ఎస్సై ఆర్థిక సాయం



**జయభేరి, వర్గల్, ఆగస్టు 26:**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక మృతి చెందింది. సమాచారం అందుకున్న గౌరారం ఎస్సై ఆరోగ్యం తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా బాలిక కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎస్సై ఆరోగ్యం చలించిపోయారు. దహన సంస్కారాల నిర్వహణకు తన వంతు సహాయంగా రూ.4,000 ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాయిత రవికుమార్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## తుర్కపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా పెండెం రవి ఏకగ్రీవ ఎన్నిక

జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 26:

తుర్కపల్లి మండల కేంద్రంలో బుధవారం నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తుర్కపల్లి మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన పెండెం రవి (వార్త రిపోర్టర్) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆరే. నర్సింహులు (నవ తెలంగాణ), ఉపాధ్యక్షులుగా అక్కారం కృష్ణ, కొండం నాగరాజు, ఆకుల శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలనుపాక కొండల్ (కనకరాజుప్రజాపక్షం), ప్రధాన కార్యదర్శి పులిగిల్ల స్వామి (ఆంధ్ర ప్రభ), కోశాధికారి ఎం.డి.చాంద్ పాషా, సహాయ కార్యదర్శులు గడిపె ఇంద్రయ్య, ఆకుల రాజుకుమార్. గౌరవ సలహాదారులు షేక్ బురాన్, ప్రచార కార్యదర్శి గా పుట్ట అంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా తునికి శ్రీనివాస్, కర్రె ఉపేందర్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పెండెం రవి మాట్లాడుతూ.. విలేకరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, మండల ప్రజల సమస్యలను ప్రభుత్వాలు, అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఆదిమూలం సురేష్, జివిలికపల్లి మహేష్, బేతాల బాబు, ఆకుల నవీన్, పుట్ట కార్తీక్, కొత్తింటి సురేష్, సుంకి శివ లను ఎన్నుకున్నారు.

## మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన పెండెం రవికి శుభాకాంక్షలు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 26:

తుర్కపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన పెండెం రవి కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, బీర్ల అయిలయ్య చరవాణి ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవి ని అభినందించిన ఎమ్మెల్యే జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. తుర్కపల్లి మండలంలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలను సమాజానికి చేరవేయడంలో ప్రెస్ క్లబ్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా, వాస్తవాలను ఆధారంగా చేసుకుని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని, జర్నలిస్టుల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పెండెం రవి నాయకత్వంలో జర్నలిస్టులందరూ సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కి పెండెం రవి కి కృతజ్ఞతలు తెలిపారు.


## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా 116 వ జయంతి



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా 116 వ జయంతి వేడుకలు స్థానిక BC బాలికల వసతి గృహమునందు నిర్వహించుకోవడం జరిగింది. మదర్ థెరిసా పటానికి అధ్యక్షుడు NVT సభ్యులతో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ మిషనరీస్ ఆఫ్ ఛారిటీ 1950 లో కలకత్తాలో స్థాపించి 45 సంవత్సరాల పాటు సేవా కార్యక్రమాలు చేసినారని, 1929లో భారతదేశానికి వచ్చారు. కలకత్తాలోని పాఠశాలలో కొన్ని సంవత్సరాలు ఉపాధ్యాయురాలిగా పని చేశారు. అనాథలకు రోగగ్రస్తులకు పేదలకు సంస్థ ద్వారా కుష్ఠురోగులు, అనాథలు, మరణిస్తున్న నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి వారి చివరి క్షణాలలో గౌరవం అందించారు.1979లో నోబుల్ శాంతి పురస్కారం అందజేయగా 1980లో భారత దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న అవార్డు పొందడం జరిగింది అని ఈ సందర్భంగా వారు అన్నారు. ప్రతి ఒక్కరు ముఖ్యంగా ఆడపిల్లలు ఆమె ఆశయ సాధనకై పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, వల్లమల్ల ఆంజనేయులు AISF జిల్లా అధ్యక్షులు, కరాటే మాస్టర్ గోపి, VVR, SFI డివిజన్ కార్యదర్శి వెంకటేష్, రాజేష్, మల్లయ్య, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, రాము, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## గరుడ వస్త్ర సిల్క్ షాపింగ్ మాల్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల కేంద్రంలోని నేతాజీ రోడ్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ గరుడ వస్త్ర సిల్క్ షాపింగ్ మాల్ ను బుధవారం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గరుడ వస్త్ర సిల్క్ యాజమాన్యం మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలకు శరీర దానం

- మరణంతో అమరత్వాన్ని పొందిన కామ్రేడ్ సుమతి

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సుశ్రుత ప్రజా వైద్యశాలలో సుమతి పార్థివ దేహానికి మహబూబ్ నగర్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యెన్నం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణం తర్వాత కూడా సమాజం గుండెల్లో సజీవంగా జీవించడం అందరికీ సాధ్యం కాదని, కామ్రేడ్ సుమతి జీవించినంత కాలం అనుక్షణం సమాజ శ్రేయస్సు కోసం పాటుపడ్డ కామ్రేడ్ సుమతి మరణం తర్వాత తన దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించి స్ఫూర్తివంతంగా నిలిచిందని అన్నారు. సుమతి పార్థివ దేహదానం నూతన వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు బోధనోపకారంగా ఎంతో ఉపయోగప డుతుందని సుమతి జీవితం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ ఎ నటరాజ్ మాట్లాడుతూ ఒకే కుటుంబంలో ఇద్దరి పార్థివ దేహాలను మహబూబ్ నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అందించిన డాక్టర్ మధుసూదన్ రెడ్డి కుటుంబం సుశీల ప్రజా వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి డాక్టర్ ప్రతిభ దంపతులు తమ ఇద్దరి మాతృమూర్తుల పార్థివదేహాలను ప్రభుత్వం వైద్య కళాశాలకు అందించి ఎంతోమందికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచారని. గత ఆరు సంవత్సరాల క్రితం డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాతృమూర్తి రామసుబ్బమ్మ మృతి చెందగా వారి మాతృమూర్తి పార్థివ దేహాన్ని కూడా మహబూబ్ నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేశారని డాక్టర్ మధుసూదన్ రెడ్డి దంపతుల నిర్ణయాన్ని పలువురికి ఎంతో స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. కామ్రేడ్ సుమతికి నివాళులు అర్పించిన వారిలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామ్యూల్, ఎపి రాష్ట్ర కార్యదర్శి బి శ్రీనివాస్ రావు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య, సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, ప్రభాకర్ రెడ్డి, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు భాస్కర్,సాగర్,సుధాకర్,నాగేశ్వరరావు, రంగారెడ్డి, భూపాల్ ,మల్లు లక్ష్మి కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ ఎంబి ట్రస్ట్ ఏపీ కార్యదర్శి మురళీకృష్ణ, ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఇందిరా, జ్యోతి , మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్ధన్, ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ విజయ్ కాంత్ మరియు దేహదానంకు సహకరించిన వారందరికి రెడ్ క్రాస్ చైర్మన్ ఎ నటరాజ్ ధన్యవాదాలు తెలిపారు. మహబూబ్నగర్ జిల్లా సిపిఎం కార్యదర్శి ఏ రాములు, నాగర్ కర్నూలు జిల్లా కార్యదర్శి పర్వతాలు, వనపర్తి జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నారాయణపేట జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, గద్వాల జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కురుమూర్తి, మోహన్, చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

# రామ మందిర్ చరిత్రలో తొలిసారి వేడుక

- అయోధ్యలో సీతారాముల కల్యాణం మహోత్సవంలో పాల్గొన్న శంకర్ స్వామీజీ
- తెలంగాణ సాధు పరిషత్ సారథ్యం

జయభేరి, దేవరకద్ర :



అయోధ్య క్షేత్రంలో బుధవారం జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి ప్రముఖ శంకర్ స్వామీజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధల మధ్య కమనీయంగా జరిగింది. అయోధ్య చరిత్రలో తొలిసారిగా నిర్వహించిన ఈ కల్యాణోత్సవానికి తెలంగాణ సాధు పరిషత్ సారథ్యం వహించింది. లోక కళ్యాణం, ధర్మరక్షణ లక్ష్యాలతో ఛత్రపతి శివాజీ పీఠాధిపతి శ్రీ బైలూరి యోగేష్ ప్రభు పరిషత్ అధ్యక్షుడు శ్రీ శంకర్ స్వామీజీ, ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అయోధ్య నగర మేయర్ గిరీష్ పతి త్రిపాఠి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్నం సునీతా మహేందర్ రెడ్డి హాజరయ్యారు. వారు సీతారాముల వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆలయ పూజారి సత్యనారాయణ దాస్‌జీతో పాటు తెలంగాణకు చెందిన పూజారులు విశ్వనాథ్ రాజు, మణిదీప్, సుకేష్ శర్మ, రాంబాబు సంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన కొలన్ మౌనిక బాల్ రెడ్డి, మణిదీప్, రవికిరణ్, సత్యనారాయణ రాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రోటోకాల్ అధికారులు వారికి బాల రాముల వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ప్రపంచంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధర్మం వర్ధిల్లాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకాంక్షించారు.

# ఏకగ్రీవంగా దేవరకద్ర పిఆర్ టియుటిఎస్ ఎన్నికలు

- అధ్యక్షులు గా రఘువర్ధన్ రెడ్డి
- ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ యాదవ్

జయభేరి, దేవరకద్ర :




పిఆర్ టియుటిఎస్ దేవరకద్ర మండల శాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా బుధవారం జరిగాయి. దేవరకద్ర జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పి ఆర్ టి యు అధ్యక్షులు రఘు వర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన పి ఆర్ టి యు టి ఎస్ మండల సర్వ సభ్య సమావేశానికి జిల్లా అధ్యక్షులు జి.మదన్ మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు వి.బుచ్చా రెడ్డి లు ముఖ్య అతిథులు గా హాజరయ్యారు. ఈ సందర్భంగా పి ఆర్ టి యు వ్యవస్థాపకులు సామాల యాదగిరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాంత్ యాదవ్ ప్రవేశ పెట్టిన ప్రధాన కార్యదర్శి నివేదికను ముక్త కంఠంతో ఆమోదించారు. సర్వ సభ్య సమావేశానంతరం జరిగిన మండల శాఖ ఎన్నికలకు మహబూబ్ నగర్ రూరల్ మండల శాఖ అధ్యక్షులు గడ్డం అంజయ్య ఎన్నికల అధికారిగా, పరిశీలకులుగా పి ఆర్ టి యు సీనియర్ నాయకులు, రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యులు లయన్ అశ్విని చంద్రశేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో మండల అధ్యక్షులు గా రఘువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ యాదవ్ లు తిరిగి రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా సూర్మి రాఘవేందర్, మహిళా మండల అసోసియేట్ అధ్యక్షురాలుగా జయమ్మ, మండల ఉపాధ్యక్షులు గా, ఎ.పవన్ కుమార్, నరేందర్ శర్మ, మహిళా ఉపాధ్యక్షురాలుగా అరుణ, వీణారాణి, మండల కార్యదర్శులు గా బి శ్రీధర్, హేమంత్ కుమార్, మండల మహిళా కార్యదర్శులుగా, దివ్య భారతి, అనురాధలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గానికి ఎన్నికల అధికారి అంజయ్య, పరిశీలకులు లయన్ అశ్విని చంద్రశేఖర్ లు ధ్రువ పత్రాలను ప్రదానం చేశారు. కాగా ప్రమాణ స్వీకారం చేసిన నూతనంగా కార్యవర్గాన్ని జిల్లా బాధ్యులు మదన్ మోహన్ యాదవ్, సుధాకర్ రెడ్డి, బుచ్చా రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యులు లయన్ అశ్విని చంద్రశేఖర్ లు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యంఈ ఓ బలరామ్, జి హెచ్ యం లు రమేష్, రామ లింగం, పి ఆర్ టి యు టి ఎస్ మాజీ అధ్యక్షులు నారాయణ గౌడ్, నాయకులు తిమ్మారెడ్డి, డి. కవిత, సురేష్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో మిలాద్‌ఉన్‌నబి వేడుకలు



- ముస్లిం సోదరులకు అన్నదాన వితరణ చేసిన సయ్యద్ ఫరూఖ్ అలి

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం రాత్రి మొహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని స్థానిక జామియా మజీద్ లో మిలాద్ ఉన్‌నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ పర్వదిన వేడుకలను అత్యంత ఘనంగా భక్తశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పవిత్ర దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జామే మజీద్ లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

పవిత్ర దినోత్సవ విశిష్టతను మత పెద్దలు ముస్లిం సోదరులకు వివరించారు. విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫరూఖ్ అలీ ముస్లిం సోదరులకు అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మైనార్టీ వాడలో ప్రత్యేక ఫాతిహా కార్యక్రమం అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక మైనార్టీ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మిలాద్‌ఉన్‌నబి వేడుకల్లో ఎమ్మెల్యే జీఎంఆర్

- రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే
- ఈద్గా విస్తరణ పనులకు శంకుస్థాపన

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్ లో బుధవారం మొహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని స్థానిక జామియా మజీద్ లో నిర్వహించిన మిలాద్ ఉన్‌నబి వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన పర్వదిన వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్థానిక జామే మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈద్గా విస్తరణ పనులకు కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్‌నబీ పర్వదిన వేడుకలు

- ముస్లిం సోదరులతో కిటకిటలాడిన మజీద్ లు
- ఘనంగా ర్యాలీలు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లాలో బుధవారం మిలాద్‌ఉన్‌నబి పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని కనుల పండువగ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాలలో ఉన్న ప్రార్థన స్థలాలైన మజీద్ లను రంగురంగుల విద్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించారు. మజీద్ ఆవరణలను కూడా అలంకరించారు. విశేష దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు ర్యాలీలు నిర్వహించారు. జెండాలు చేత పట్టుకొని పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు. అన్నదాన వితరణ కార్యక్రమాలను కూడా నిర్వహించారు. మంగళవారం రాత్రి మజీద్ లలో పర్వదిన వేడుకల విశిష్టతను మత పెద్దలు వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై దాడి చేసే థాయ్ మాంగూర్ ఫిష్

జయభేరి, ముంబై, ఆగస్టు 26:

మహారాష్ట్రంలో భారీగా థాయ్‌మాంగూర్ ఫిష్ అంటే క్యాట్‌ఫిష్‌ను అధికారులు పట్టుకున్నారు. లారీ కొద్ది చేపలని పూడ్చి పెట్టారు. ఇవి తింటే క్యాన్సర్ వస్తుందని అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే చూడటానికి ఒకేలా ఉండే కొరమీను, క్యాట్‌ఫిష్ మధ్య తేడాని ఎలా గుర్తించాలో చూద్దాం. మాంసాహార ప్రియుల ఇళ్లల్లో ముక్క ఉడకాల్సిందే. చికెన్, మటన్ కంటే చాలా మంది చేపల వంటకానికే తొలి ప్రాధాన్యత ఇస్తారు. అందులోనూ తెలుగు వారికి కొరమీను చేపలంటే ప్రాణం. అద్భుతమైన రుచితోపాటు, ఆరోగ్యానికి మంచి చేసే ఈ చేపలను వైద్యులు కూడా సిఫార్సు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌కు వెళ్లే వినియోగదారులకు ఒక నమ్మలేని షాకింగ్ నిజం ఎదురవుతోంది. మీరు మార్కెట్‌లో కిలోకి 600 నుంచి 900 వరకు భారీ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్న చేప నిజంగానే అసలైన కొరమీనేనా లేకా ప్రాణాంతకమైన క్యాట్ ఫిషా అనే అనుమానం కలగక మానదు. ప్రజల్లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని చాలా మది క్యాట్‌ఫిష్‌ను కొరమీను అంటూ అమ్మకాలు చేస్తున్నారు. భారత్ ప్రభుత్వం పూర్తిగా నిషేధించిన అత్యంత విషపూరితమైన థాయ్ మాంగూర్ చేపలు కొరమీను ముక్కలుగా వినియోగదారుల నెత్తిన రుద్దుతున్నారు. చూసేందుకు దాదాపు ఒకే రూపురేఖలతో ఉండే ఈ నకిలీ కొరమీనును ఆహారంగా తీసుకోవడంవల్ల క్యాన్సర్, కాలేయ సంబంధిత ప్రాణాంతక వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, కేంద్ర మత్స్యశాఖలు దేశంలో ఈ చేపల పెంపకాన్ని, విక్రయాన్ని పూర్తిగా నిషేధించింది. అయినా చాలా మంది వ్యాపారులు దొంగచాటున విక్రయిస్తున్నారు. దీని వెనుక పెద్ద మాఫియా ఉంది. గుట్టుచప్పుడు కాకుండా మురికి కాలువల్లో, డ్రైనేజీల్లో, నీటి గుంటల్లో వీటిని పెంచుతున్నారు. థాయ్ మాంగూర్ చేపలు కేవలం 2 నుంచి 3 నెలల వ్యవధిలోనే కేజీల కొద్ది బరువు పెరుగుతాయి. వీటికి ప్రత్యేకంగా ఎలాంటి ఆహారం వేయాల్సిన పని లేదు. కుళ్లిన మాంసం, కోళ్ల వ్యర్థాలు, డ్రైనేజీ మురుగు నీటిలో ఉండే ఫుడ్ తింటూ పెరుగుతాయి. కొన్నిప్రాంతాల్లో లైవ్ ఫిష్‌ను అమ్ముతుంటే, మరికొన్నిప్రాంతాల్లోతలలు తీసేసి మిగతా భాగాన్ని కొరమీనుగా చెప్పి విక్రయిస్తుంటారు. ఇవి మురుగు నీటిలో, ఆక్సిజన్ లేని ప్రాంతాల్లో పెరగడం వల్ల అత్యంత ప్రమాదకరమైన లోపాలు వీటి శరీరంలో నిల్వ అవుతాయి. ఆర్సెనిక్, సీసం, పాదరసం, కాడ్మియం, ఐరన్ వంటి ప్రమాదకరమైన లోపాలు ఉంటాయి. ఇవి మనిషి బాడీలోకి వెళ్లి రోగనిరోధక శక్తిని నాశనం చేస్తాయి. ఈ చేపల కణజాలాల్లో పేరుకుపోయే టాక్సిన్లు, కార్సినోజెన్లు గ్యాస్ట్రిక్, చర్మ క్యాన్సర్ కణాలను ఉత్పత్తి చేస్తాయి. క్రమం తప్పకుండా తీసుకుంటే కడుపునొప్పి, లీవర్ డ్యామేజ్, కిడ్నీ ఫెయిల్యూర్, చర్మ రోగాలు వస్తాయి. గర్భిణీలు, చిన్న పిల్లలు తీసుకుంటే నరాలబలహీనత, మెదడు ఎదుగుదల లోపం, శారీరక వైకల్యం వచ్చే ప్రమాదం ఉంది. చేపలను కొనుగోలు చేసేటప్పుడు కేవలం పైపైన చూసి మోసపోతుంటాం. టచ్ చేస్తే చాలా వరకు మంచి చేపలను గుర్తించవచ్చు. కొరమీను చర్మంపై గట్టి, నిండైన పొలుసులు ఉంటాయి. పద్ధతిగా అమర్చి ఉంటాయి. పట్టుకున్నప్పుడు చేతికి పొలుసుల గరుకుదనం, గట్టిదనం తెలుస్తుంది. అయితే క్యాట్‌ఫిష్‌పట్టుకొని చూస్తేవాటికి పొలుసులు ఉండవు. చర్మం ఎక్కువ జిగురుగా, బంకగా, ఉంటుంది. మార్కెట్‌లో పొలుసులు లేకుండా నల్లటి నిగనిగలాడే చేపలు కనిపిస్తేమాత్రం అవి కొరమీను కావని గుర్తు పెట్టుకోండి.





## తల భాగం గమనిస్తే తెలుస్తుంది!

చేప తల భాగాన్ని గమనిస్తే ఆ చేప జాతి ఏంటో క్షణాల్లో తెలిసిపోతుంది. కొరమీనును అంతర్జాతీయంగా స్నేక్ హెడ్ ఫిష్ అంటారు. అంటే పాము తల ఆకారంలో చదునుగా ఉంటుంది. దీని మూతి వద్ద ఎలాంటి మీసాలు ఉండవు. తలపై కూడా పొలుసులు ఉంటాయి. క్యాట్‌ఫిష తలభాగం చాటలాగా చాలా వెడల్పుగా ఉంటుంది. చదునుగా ఉంటుంది. గట్టి ఎముక నిర్మాణం కలిగి ఉంటుంది. దీని మూతి వద్ద 4 జతల పొడవైన మీసాలు ఉంటాయి. కొరమీను వీపుపై ఉండే రెక్క పొడవుగా ఉన్నప్పటికీ తోకకు వరకు ఉండదు. దీని తోక భాగం విడిగా స్పష్టమైన గుండ్రటి ఫ్యాన్ ఆకారంలో ఉంటుంది. కొరమీను శరీరంపై నలుపు, ముదురు పచ్చ లేదా గోధుమ రంగు చారలు ఉండి, పొట్ట భాగం తెల్లగా లేత పసుపు రంగులో ఉంటుంది. థాయ్ మాంగూర్ ఫిష్ వీపుపై పెద్ద రెక్క ఉంటుంది. ఇది తల నుంచి తోక వరకు ఉంటుంది. దీని బాడీ పూర్తిగా నల్లగా, బూడిద రంగులో ఉంటుంది.కొరమీను ముక్కలుగా కోసినప్పుడు దాని మాంసం తెల్లగా, గట్టిగా ఉంటుంది. ఒకే ముల్లు ఉంటుంది. చిన్న ముల్లులు ఉండవు. వండుతుండగా ముక్కలు విరిగిపోవు. థాయ్ మాంగూర్ ముక్కలు తెల్లగా ఉండదు. ఇది ఎర్రగా, లేదా ముదురు రంగులో ఉంటుంది. వండేటప్పుడు ముక్కలు త్వరగా మెత్తబడి విరిగిపోతాయి. నీచు వాసన వస్తుంది.



## భవిష్యత్తులో మరిన్ని విజయాలు

జయభేరి, మేడిపల్లి :

కర్నూల్ రిడ్జ్ స్కూల్లో ఈ నెల 25న జరిగిన సిబిఎస్ సౌత్ జోన్ వన్ ఆర్చరీ ఛాంపియన్షిప్ పోటీలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని తాటిపల్లి అశ్వజ, 9వ తరగతి విద్యార్థిని అండర్ 17 విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచింది. మొత్తం 662 స్కోర్ సాధించి.. గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా తాటిపల్లి అశ్వజను, ఆమె తల్లిదండ్రులను పాఠశాల యజమాన్యం, కోచ్, పలువురు అభినందించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## మిలాద్‌ఉన్‌నబీ పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




జయభేరి, ఉప్పల్ :

రామంతాపూర్ కేసిఆర్ నగర్‌లో మిలాద్‌ఉన్‌నబీ వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఇస్లాం మత ప్రవక్త హజ్రత్ మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు పవిత్రంగా జరుపుకునే మిలాద్‌ఉన్‌నబీ పర్వదినం సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రామంతాపూర్‌లోని కేసిఆర్ నగర్‌లో నిర్వహించిన మిలాద్‌ఉన్‌నబీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి పర్వదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోదరభావం, శాంతి, సహనం, ప్రేమ, కరుణ వంటి మానవీయ విలువలను ప్రబోధించిన హజ్రత్ మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని అన్నారు. ఆయన బోధనలు సమాజంలో శాంతి, ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మిలాద్‌ఉన్‌నబీ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు, సౌభ్రాతృత్వం, సమృద్ధి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహంకాళి, శ్రీ పోచమ్మ దేవతల ప్రతిష్ఠా మహోత్సవం

■ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

నాగోల్ డివిజన్-29, ఎల్.బి.నగర్ పరిధిలో నిర్వహించిన శ్రీశ్రీ మహంకాళి, శ్రీశ్రీ పోచమ్మ దేవతల నూతన దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశ్వరులు పరమహంస పరివ్రాజకులు అనంత శ్రీ విభూషిత జగద్గురు శ్రీ శ్రీ శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి ఆశీస్సులతో, వారి పర్యవేక్షణలో ప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నాగోల్ గ్రామంతో పాటు తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ యెగ్గ మల్లేశం కూడా హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సోనియా గాంధీ నగర్‌లో ఫేజ్ 2 లో సీసీ కెమెరాల ప్రారంభం



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని సోనియా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫేజ్ 2 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సీసీ కెమెరాలను ప్రారంభించారు. కాలనీ ప్రజల భద్రత, రక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాలనీలో నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ నాయకులు, సభ్యులు, స్థానిక ప్రజలు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రహదారులపై పేరుకుపోయిన చెత్త..

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

రామంతాపూర్ బగాయత్ ప్రాంతంలోని కేసిఆర్ నగర్ దగ్గరలో రహదారులపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఎమ్మెల్యే, ప్రాంతంలో పరిశుభ్రతకు ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. చెత్త సేకరణ పనులను క్రమం తప్పకుండా నిర్వహించి, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా చూడాలని అధికారులతో పాటు రాంకీ సంస్థ ప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రామంతాపూర్ బగాయత్ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు. బడ్ల నుండి కింద పోయడం జరుగుతుంది అని ఆయన అన్నారు.



## నేపాల్ విపత్తు మనకు ఇచ్చిన హెచ్చరిక
# మన పిల్లల భవిష్యత్తు సురక్షితమేనా?

జయభేరి, హైదరాబాద్ :

నిన్న నేపాల్‌లో సంభవించిన అకస్మాత్తు ప్రకృతి విపత్తు దృశ్యాలు మనసును కలచి వేస్తున్నాయి. క్షణాల్లో ఉప్పొంగిన వరదలు ఇళ్లు, వంతెనలు, రహదారులు, జీవనాధారాలను కొట్టుకుపోయాయి. వందలాది మంది మరణించగా, మరెందరో గల్లంతయ్యారు. సహాయక చర్యలు కూడా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కొనసాగుతున్నాయి. ఇది కేవలం నేపాల్‌కు సంబంధించిన విషాదం కాదు. ఇది మనందరికీ వచ్చిన ఒక హెచ్చరిక.

మన పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుంది?

ప్రకృతి విపత్తులు పూర్తిగా మన చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ ప్రకృతి విపత్తు ఎంత పెద్ద విపత్తుగా మారాలి అన్నదానిలో మాత్రం మనుషుల పాత్ర చాలా ఉంటుంది. అడవుల నరికివేత, నదీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలు, పర్యావరణాన్ని పట్టించుకోని నిర్మాణాలు, భూగర్భ జలాల దుర్వినియోగం, కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలు—ఇవి అన్నీ కలిపి మన పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. హిమాలయ ప్రాంతాల్లో మంచు, హిమనదులు వేగంగా మారుతున్న పరిస్థితులు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. తాజా నేపాల్ ఘటనలో హిమనదం లేదా మంచురాళ్ల భారీ కూల్చివేత ఆకస్మిక వరదకు కారణమై ఉండవచ్చని ప్రాథమిక శాస్త్రీయ అంచనాలు చెబుతున్నాయి. అయితే మనం మన పిల్లలకు ఎలాంటి ప్రపంచాన్ని అందిస్తున్నాం?

వారికి మంచి పాఠశాలలు, మంచి ఉద్యోగాలు, మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటున్నాం. కానీ వారు జీవించాల్సిన సురక్షితమైన భూమిని కూడా వారికి అందిస్తున్నామా? ఇది ప్రతి తల్లిదండ్రి, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి అధికారి, ప్రతి పౌరుడు ఆలోచించాల్సిన ప్రశ్న. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఏం చేయాలి? ప్రకృతి వైపరీత్యాలను ఆపలేకపోయినా, వాటి వల్ల జరిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

**1. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు:**
వరదలు, కొండచరియలు, హిమనదుల మార్పులు, భారీ వర్షాలపై శాస్త్రీయ పర్యవేక్షణ, గ్రామ స్థాయి వరకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఉండాలి.



**మరిపల్లి చందన**
మెంబెర్
తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ అఫ్ చైల్డ్ రైట్స్

**2. పిల్లలకు Disaster Preparedness నేర్పాలి:**
పాఠశాలల్లో భూకంపం, వరద, అగ్ని ప్రమాదం, తుఫాను, కొండచరియలు వంటి విపత్తుల సమయంలో ఎలా స్పందించాలో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలి.

**3. పాఠశాలలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి:**
పిల్లలు ఎక్కువ సమయం గడిపే పాఠశాల భవనాలు disasterresilient గా ఉండాలి. అత్యవసర నిష్క్రమణ మార్గాలు, assembly points, firstaid, emergency contact systems తప్పనిసరి చేయాలి.

**4. ప్రతి గ్రామానికి Disaster Plan ఉండాలి:**
ప్రమాద ప్రాంతాల మ్యాపింగ్, సురక్షిత ప్రాంతాలు, evacuation routes, అత్యవసర వాహనాలు, రక్షణ బృందాలు ముందుగానే సిద్ధంగా ఉండాలి.

**5. నదులు, చెరువులు, కొండ ప్రాంతాలను రక్షించాలి:**
ప్రకృతి నీటి ప్రవాహ మార్గాలను ఆక్రమించి నిర్మాణాలు చేయకుండా కఠినమైన నియంత్రణ అవసరం.

6. పిల్లలను ప్రత్యేకంగా రక్షించాలి:
విపత్తుల సమయంలో పిల్లలు తల్లిదండ్రుల నుంచి విడిపోయే ప్రమాదం ఎక్కువ. ప్రతి disaster response planలో child tracking, family reunification, temporary shelters, education continuity మరియు child protection mechanisms తప్పనిసరిగా ఉండాలి.

**మన పిల్లలకు మనం ఇచ్చే గొప్ప వారసత్వం ఏమిటి?**
మన పిల్లలకు కేవలం ఆస్తులు ఇవ్వడం కాదు. వారికి సురక్షితమైన పర్యావరణం, స్వచ్ఛమైన గాలి, తాగునీరు, పచ్చని అడవులు, ఆరోగ్యకరమైన జీవితం, ప్రకృతిని గౌరవించే సంస్కృతి అందించాలి. ఒక చెట్టు నాటడం చిన్న పని అనిపించవచ్చు. కానీ అది భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే ఒక జీవన హామీ. ఒక ప్లాస్టిక్ వస్తువును తిరస్కరించడం చిన్న విషయం అనిపించవచ్చు. కానీ లక్షలాది మంది అలా చేస్తే అది పెద్ద మార్పు. ఒక నదిని కలుషితం చేయకుండా కాపాడటం ఒక వ్యక్తి పని అనిపించవచ్చు. కానీ ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుంటే ఒక నది తరతరాలకు జీవనాధారంగా ఉంటుంది.

ముగింపు — ప్రకృతిని నిందించే ముందు మనల్ని మనం ప్రశ్నించుకుందాం.

**నేపాల్ ఘటన మనకు ఒక కఠినమైన ప్రశ్న వేసింది:**
"మన పిల్లల కోసం మనం ఎలాంటి భవిష్యత్తును నిర్మిస్తున్నాం?" ప్రకృతి తన పని చేస్తోంది. కానీ ప్రకృతితో మనం ఎలా వ్యవహరిస్తున్నామన్నదే రేపటి విపత్తుల తీవ్రతను నిర్ణయిస్తుంది. ప్రభుత్వం మాత్రమే బాధ్యత వహించదు. శాస్త్రవేత్తలు మాత్రమే బాధ్యత వహించరు. పర్యావరణ సంస్థలు మాత్రమే బాధ్యత వహించవు. ప్రతి ఒక్కరి పాత్ర ఉంది. ఒక చెట్టు నాటే తల్లిదండ్రి నుంచి, పర్యావరణాన్ని కాపాడే విద్యార్థి వరకు బాధ్యతాయుతంగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే అధికారి నుంచి, ప్రకృతి వనరులను కాపాడే ప్రజాప్రతినిధి వరకు...ప్రతి ఒక్కరి చిన్న చర్య భవిష్యత్తు తరాల భద్రతకు పెద్ద అడుగు.

**ఈరోజు మనం ప్రకృతిని కాపాడితే.. రేపు ప్రకృతి మన పిల్లలను కాపాడుతుంది.**



# ఏం తీశారు బాబూ..

సినిమా ఇండస్ట్రీలో భారీ బడ్జెట్‌తో సినిమాలు తీయడం, అవి బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడం సహజమే. అయితే కొన్నిసార్లు ఎంత పెద్ద స్టార్ కాస్టింగ్ ఉన్నా, కోట్లు కుమ్మరించినా సినిమాలు దారుణంగా ఫ్లాప్ అవుతుంటాయి. కానీ, ఏకంగా రూ. 45 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తే.. థియేటర్లలో కేవలం రూ. 60 వేలు మాత్రమే వసూలు చేసిందంటే నమ్మగలరా? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది పక్కా నిజం. భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పెద్ద డిజాస్టర్‌గా నిలిచిన ఆ చిత్రం పేరు 'ది లేడీ కిల్లర్'. భారీ అంచనాలు, భారీ బడ్జెట్ మధ్య ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 2023లో విడుదలైన ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అర్జున్ కపూర్, క్రేజీ హీరోయిన్ భూమి పెడ్నేకర్ జంటగా నటించారు. అజయ్ బహల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ టీసిరీస్ బ్యానర్‌పై భారీ స్థాయిలో రూ. 45 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించారు. స్టార్ హీరోహీరోయిన్లు, పెద్ద నిర్మాణ సంస్థ ఉండటంతో ఈ సినిమాపై విడుదల ముందు కొన్ని అంచనాలు ఉండేవి. కానీ థియేటర్లలో విడుదలైన మొదటి రోజే ఈ సినిమా పరిస్థితి ఘోరంగా తయారైంది. ఎంతలా అంటే, ఈ చిత్రానికి మొదటి రోజు దేశవ్యాప్తంగా అమ్ముడైన టికెట్లు కేవలం 293 మాత్రమే! మొదటి రోజు కలెక్షన్లు రూ. 38 వేలుగా నమోదయ్యాయి. ఇక ఈ సినిమా థియేట్రికల్ రన్ ముగిసేసరికి సాధించిన మొత్తం వసూళ్లు కేవలం రూ. 60 వేలు. అంటే పెట్టిన బడ్జెట్‌లో ఒక శాతం కాదు కదా, కనీసం ప్రింట్ అండ్ పబ్లిసిటీ ఖర్చులు కూడా రాలేదు.



# సుజయ్ ప్రొడక్షన్స్ & అర్‌ఎన్ క్రియేషన్స్ నూతన చిత్రం ప్రారంభం

యష్ తేజ్, జయశ్రీ జంటగా సుజయ్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో అర్‌ఎన్ క్రియేషన్స్ సమర్పణలో చందు దర్శకత్వంలో కె గోపాల్, జె రవీందర్ నిర్మాతలుగా తెరకెక్కబోతున్న ప్రేమకథ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ కెమెరా స్విచ్ ఆన్ చెయ్యగా ముహూర్తం సన్నివేశానికి దర్శకుడు విఎన్ ఆదిత్య క్లాప్ కొట్టారు అలాగే మామిడి హరికృష్ణ స్క్రిప్ట్ ను చిత్ర యూనిట్ కు అందజేశారు. ప్రేమించుకొనే యువత తల్లి తండ్రులని దృష్టిలో ఉంచుకుంటే ఏం జరుగుతుంది? ప్రేమలో ఉన్న అబ్బాయి అమ్మాయి వారి పేరెంట్స్ గురుంచి ఎలా ఆలోచిస్తారు? వంటి సంఘటనలతో ఈ సినిమా కథాంశం ఉంటుందని దర్శకుడు చందు చెబుతున్నారు. ఒక సరికొత్త ప్రేమను తెరమీద ఆవిష్కరించబోతున్నందుకు ఆనందంగా ఉందని నిర్మాతలు కె గోపాల్, జె రవీందర్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ భూపతి యాదగిరి, సంగీతం నాగ వంశీ, సినిమాటోగ్రఫీ నాని బిశెట్టి, సురేష్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎర్రం రామకృష్ణ.

# టైటిల్ తెలిసేది ఆరోజే!



అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై రూపొందుతున్న ఈచిత్రానికి రా కార్తీక్ దర్శకుడు. నిన్నేపెళ్లాడతా, ఆవిడా మా ఆవిడే చిత్రాల్లో నాగార్జునకు జోడీగా నటించిన టబూ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. నాగార్జున పుట్టినరోజైన ఆగస్ట్ 29న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్టు బుధవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. అభిమానులు పండుగ చేసుకునేలా అద్భుతమైన టైటిల్‌ని ఈ సినిమాకు నిర్ణయించినట్టు వారు చెప్పారు. ఈ టైటిల్ గ్లింప్స్‌లోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు కూడా వెల్లడికానున్నాయని వారు పేర్కొన్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే.

# "రోమాంచకం" మూవీ ట్రైలర్ లాంచ్



బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళి పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం". సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్నారు. ఈ రోజు "రోమాంచకం" చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అనంతిక సనిల్ కుమార్ మాట్లాడుతూ మా సినిమా చూసి ప్రతి ఒక్కరూ ప్రేమలో పడతారు. మా చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. ఈ సినిమాలో హీరోయిన్ గా నేను బాగుంటానని నమ్మి అవకాశం కల్పించిన మా డైరెక్టర్, ప్రొడ్యూసర్స్ కు థ్యాంక్స్. ఈ టీమ్ లోని అందరితో హ్యాపీగా వర్క్ చేశాను. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ ఏంటో ఫీల్ కావాలంటే సెప్టెంబర్ 3న మా మూవీ చూసేందుకు థియేటర్స్ కు రండి. ఈ సినిమా సెట్ లో జాయిన్ అయిన మొదటి రోజు నుంచే పాజిటివ్ ఫీల్ తో వర్క్ చేశాం. అన్నారు. హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ సొంత బ్రదర్స్ లా నన్ను ఎంకరేజ్ చేస్తున్న మా సందీప్ అన్న, ప్రణయ్ అన్నకు థ్యాంక్స్. రోమాంచకం క్యూట్ లవ్ ఫిలిం. భద్రకాళీ సంస్థలో ట్రావెల్ అవుతుంటే తెలిసింది సందీప్ అన్న, ప్రణయ్ అన్న ఎంత మంచి మనసున్న వాళ్లో. యాక్టర్ గా ఓపెన్ అప్ అయిపోయి నటించే అందరినీ నవ్వించే అందరూ ఇష్టపడే ఇలాంటి బ్యూటిఫుల్ క్యారెక్టర్ లో నటించే అవకాశం నాకు కల్పించిన మా డైరెక్టర్ వేణు అన్నకు కృతజ్ఞతలు. అనంతిక మంచి పర్ ఫార్మర్, ఏ విద్య నేర్చుకోమన్నా త్వరగా నేర్చుకుంటుంది. సోహన్, వెంకటేష్, నరేంద్ర,..ఇలా మా బ్యాచ్ అంతా నిజంగా స్నేహితులా అనేంత సహజంగా కనిపిస్తాం. నరేంద్ర చేసిన చింటు క్యారెక్టర్ మీ అందరికీ గుర్తుండిపోతుంది. ట్రైలర్ మీ అందరికీ నచ్చితే థియేటర్స్ కు వచ్చేయండి, మీతో పాటు మరికొందరిని తీసుకురండి. భద్రకాళీ పిక్చర్స్ లో వస్తున్న ఫన్ క్యూట్ ఎంటర్ టైనర్ ఇది. మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్ ఎవరితో చూసినా ఎంజాయ్ చేస్తారు. మీరు ఎవర్ని సినిమాకు తీసుకువెళ్లినా డిజప్పాయింట్ కారు. ఆ కాన్ఫిడెంట్ తో సినిమాకు వెళ్లండి. అన్నారు. ఈ సినిమాకు ఫ్యామిలీతో పాటు రండి. మ్యూజిక్ చాలా బాగుంది. సినిమా చూస్తున్నంత సేపు టైమ్ తెలియలేదు. అప్పుడే ఇంటర్వెల్ వచ్చిందా అనుకున్నా. ట్రైలర్ సరదాగా ఎలా ఉందో సినిమా కూడా అలాగే ఉంటుంది. ఈ సినిమాను డెఫనెట్ గా ప్రేక్షకులు చూస్తారు. సినిమా అంతా ఒక ఫ్లోలో కామెడీతో వెళ్తుంటుంది. ట్రైలర్ కోసం ఎక్కడ సీన్స్ కట్ చేయాలో తెలియలేదు. ఇలాంటి స్క్రిప్ట్ నేను రాయలేను. కామెడీకి ఎజెండా ఏమీ ఉండదు, నవ్వించాలి. సినిమాటిక్ అడ్వాంటేజ్ తీసుకోకుండా ఈ రోజుల్లో స్క్రిప్ట్ రాయడం కష్టం. కానీ ఈ సినిమాకు ఆ సినిమాటిక్ అడ్వాంటేజ్ చాలా తక్కువ తీసుకున్నారు. నాకు ఈ మూవీలో నచ్చిన విషయాల్లో అదొకటి. ప్రభాస్ అన్నతో సినిమా చేయడమే నా లైఫ్ లో రోమాంచకం మూవ్‌మెంట్. అన్నారు.



# రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేసిన గ్లామర్ బ్యూటీ ?!

ప్రముఖ టీవీ సీరియల్ హీరోయిన్ సుహాసిని పేరు సైతం వినిపించింది. అంతేకాదు గుండె నిండ గుడి గంటలు సీరియల్ ఫేమ్ బాలు పేరు వినిపించగా.. తాను వెళ్లడం లేదని వీడియోతో క్లారిటీ ఇచ్చాడు బాలు. ఇక ఇప్పుడు మరో హీరోయిన్ పేరు వినిపిస్తుంది. ఆమె మరెవరో కాదు.. డెబ్జానీ మోదక్. ఈ పేరు గుర్తుందా.. ? తనే ఎన్నెన్నో జన్మల బంధం సీరియల్ ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యింది. తెలుగు రాకపోయినప్పటికీ తనదైన నటనతో అడియన్స్ హృదయాలు గెలుచుకుంది ఈ బెంగాలీ ముద్దుగుమ్మ. అయితే ఆమెకు బిగ్ బాస్ కోసం వారానికి రూ. 4 లక్షల రెమ్యునరేషన్ ఇవ్వనున్నట్లు టాక్ వినిపిస్తుంది. తెలుగులో ఎన్నెన్నో జన్మల బంధం, సత్యభామ వంటి సీరియల్స్ ద్వారా మంచి పాపులారిటీ సంపాదించుకుంది. అయితే ఈ ముద్దుగుమ్మ ఫ్యామిలీ అడియన్స్ మాత్రమే కాకుండా యూత్ సైతం ఫ్యాన్స్ అయ్యారు. ఇక ఇటీవలే స్మాల్ స్క్రీన్ పై వచ్చే ఎంటర్టైన్మెంట్ షోలలో తన కామెడీ, ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు బిగ్ బాస్ 10లో డెబ్జానీ ఎంట్రీ ఇస్తుండడంతో ఎంటర్టైన్మెంట్ అదిరిపోతుందని.. ముఖ్యంగా యూత్ అట్రాక్షన్ ఎక్కువగానే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇక బిగ్ బాస్ 10లోకి సీరియల్ బ్యూటీ పల్లవి గౌడతోపాటు గుప్పెడంత మనసు ఫేమ్ రక్షిత సైతం ఎంట్రీ ఇవ్వనున్నట్లు టాక్. అలాగే జబర్దస్త్ ఫేమ్ నూకరాజు పేరు సైతం నెట్టింట వైరలవుతుంది. అయితే మరికొన్ని రోజుల్లో ఎవరెవరు హౌస్ లోకి అడుగు పెట్టనున్నారో క్లారిటీ రానుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**